# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 29-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపురానికి సమీపంలో 'మొంథా' తీవ్ర తుపాను తీరం దాటిందని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది.**

2. **'మొంథా' తీవ్ర తుపాను నేపథ్యంలో రైల్వే ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారులను ఆదేశించారు.**

3. **'మొంథా' తుపాను వల్ల నెలకొన్న సమస్యల పరిష్కారానికి త్వరతగతిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.**

4. **ప్రపంచ చలనచిత్ర పరిశ్రమకు హైదరాబాద్ నగరం వేదిక కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**

5. **ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు నుండి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**

===========================

బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా ఏర్పడిన 'మొంథా' ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడకు దక్షిణంగా నరసాపురానికి దగ్గరలో తీరం దాటిందని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాత్రి 11గంటల 30 నిమిషాల నుంచి 12 గంటల 30 నిమిషాల మధ్యలో 'మొంథా' తీరం దాటే ప్రక్రియ పూర్తయినట్లు పేర్కొంది. 'మొంథా' ఉత్తర వాయువ్యంగా తెలంగాణ మీదుగా ప్రయాణించి ఈరోజు మధ్యాహ్నం ఛత్తీస్‌గఢ్ వద్ద మరింత బలహీన పడనుందని వాతావరణ శాఖ అధికారి కరుణాసాగర్ తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి.

-------------------------

'మొంథా' తీవ్ర తుపాను నేపథ్యంలో రైల్వే ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారులను ఆదేశించారు. దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ లతో ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. తుపాను దృష్ట్యా తీసుకుంటున్న చర్యలపై

అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, సత్వర నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఒడిశా, తెలుగురాష్ట్రాల్లో డివిజనల్ వార్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలను ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజన్లలో అవసరమైన సామగ్రి, యంత్రాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని, పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని అధికారులకు  దిశానిర్దేశం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 'మొంథా' తుపాను అనంతర ప్రభావంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత రాత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అమరావతి ఆర్టీజీ సెంటర్‌కు వచ్చిన సమాచారాన్ని విశ్లేషించి తుపాను వల్ల నెలకొన్న సమస్యల పరిష్కారానికి త్వరతగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెట్ల తొలగింపు, విద్యుత్ సబ్ స్టేషన్లలో సమస్యలను తక్షణం పరిష్కరించేలా కసరత్తు చేయాలని అధికారులకు సూచించారు.  క్షేత్ర స్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు  పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మొంథా తుపాను సహాయక చర్యల్లో పాల్గొనేందుకు 11 ఎన్డీఆర్ఎఫ్, 12 ఎస్‌డీఆర్ఎఫ్ విపత్తు నిర్వహణ బృందాలను ఏర్పాటు చేశామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. రిజర్వ్ టీమ్‌లు, 876 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. తుపాను సహాయక చర్యల్ని అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి మంత్రి నిన్న పర్యవేక్షించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..33 సెకన్లు

---------------------------

మొంథా తీవ్ర తుపాను ప్రభావిత జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందున జాతీయ రహదారులపై ప్రయాణించే భారీ వాహనాలపై ఆంక్షలు కొనసాగుతాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. తుపాను ప్రభావిత జిల్లాల్లో రహదారులపై గత  రాత్రి 7 గంటల నుంచి వాహనాలను నిలుపుదల చేస్తున్నామని  పేర్కొంది. వాహనాలను ముందే సురక్షిత ప్రాంతాలలో  నిలుపుకోవాలని సూచించింది. తుపాను ప్రభావం తగ్గిన తర్వాత ప్రయాణాలకు అనుమతినిస్తామని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.

---------------------------

ప్రపంచ చలనచిత్ర పరిశ్రమకు హైదరాబాద్ నగరం వేదిక కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు. సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న  ప్రసంగించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గద్దర్ పేరు మీద సినీ అవార్డులు ప్రధానం చేశామన్నారు. సినిమా కార్మికుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. భారత ఫ్యూచర్ సిటీలో చలనచిత్ర పరిశ్రమకు ప్రాధాన్యత ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సినీ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాల నిర్మించి.. ఉచితంగా చదువు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-------------------------

తుపాను పునరావాస కేంద్రాల్లో నిర్వాసితుల కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు కాకినాడ పార్లమెంటు సభ్యులు ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. కాకినాడజిల్లా ఉప్పాడ తీరంలోని అమీనాబాద్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ,

వాయిస్..26 సెకన్లు

-------------------------

మొంథా తుపాను దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు నుండి రైతుల వద్ద పత్తి కొనుగోలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా– సీసీఐ, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేయగా సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామని . కేంద్ర ప్రభుత్వం ప్రత్తికి క్వింటాలుకు 8,110 రూపాయల కనీస మద్దతు ధర అందించేలా రాష్ట్ర వ్యాప్తంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా 30 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పత్తి పంటను అమ్మాలనుకునే రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని మంత్రి కోరారు.

-------------------------

అంతర్జాతీయ అంతర్జాల దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. 1969 అక్టోబర్ 29వ తేదీన ఒక కంప్యూటర్ నుండి మరొక కంప్యూటర్‌కు పంపిన మొదటి ఎలక్ట్రానిక్ సందేశానికి గుర్తుగా అప్పటి నుండి ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అంతర్జాల ప్రక్రియ ఉపయోగించి ఈ సందేశాన్ని పంపారు. టెలి కమ్యూనికేషన్ల చరిత్రలో అంతర్జాల ప్రక్రియ ఒక మైలురాయిగా నిలిచింది.

-------------------------

మొంథా తుపాను నేపథ్యంలో పత్తిలో తేమ శాతం పెరగకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. “రైతునేస్తం” కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ సచివాలయం నుంచి దృశ్యమాధ్యమం ద్వారా రైతులతో మంత్రి నిన్న సంభాషించారు.

=====================